క్లుప్తంగా

దూర విద్యా విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ మణికుమార్

ఎల్.ఎన్.పేట: ప్రస్తుతం దూర విద్యా విధానంలో ప్రవేశాలు జరుగుతున్నాయని, పాఠశాలకు వెళ్లి చదువుకోలేని వయోజనులు ఈ విధానాన్ని వినియోగించుకోవాలని ఎంఈఓలు సి.హెచ్.మణికుమార్, చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం దూరవిద్యా విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాల కోరే వయోజనులు మండల విద్యా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ప్రతీరోజు తరగతులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సులను పూర్తి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్, ఎంఎంఎస్ ఏపీఎం రవిరాజ్ పాల్గొన్నారు.

72 మందికి వైద్య పరీక్షలు



వైద్య సేవలు అందిస్తున్న బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది

బూర్జ: మండలంలోని నీలాదేవిపురం గ్రామంలో బూర్జ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 72 మంది రోగులకు తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాలు పడుతున్నందున అంటు రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.సుప్రియ, ఏఎన్‌ఎం కె.గౌరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో మేలు



బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బూర్జ: మండల కేంద్రంలో సేంద్రియ ఎరువుల్లో భాగంగా బ్రహ్మాస్త్రాన్ని తయారుచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం వెలుగు కార్యాలయం ఆవరణలో ప్రకృతి వ్యవసాయ, వెలుగు కార్యాలయ సిబ్బంది రైతులకు కషాయాల తయారీని వివరించారు. సేంద్రియ ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు.

కళాకృతుల తయారీపై శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పరశురామయ్య

సరుబుజ్జిలి: స్వదేశీ బొమ్మలు, కళాకృతుల తయారీలో విద్యార్థులు మరింత పరిజ్ఞానం సాధించాలని వెన్నెలవలస జవహర్‌నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య అన్నారు. విద్యాలయంలో స్వదేశీ బొమ్మలు తయారీపై నిపుణుల ఆధ్వర్యంలో మంగళవారం నవోదయ విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, బొమ్మల తయారీ నిపుణులు మహేశ్, చిట్టయ్య, ఆర్ట్ టీచర్ ఆనందరాజు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పొందూరు: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్, నివారణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో సుఖవ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ జిల్లా రీసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు అన్నారు. మంగళవారం పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సుఖవ్యాధులు–చికిత్స, హెచ్ఐవీ యాక్ట్ 2017పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డి.రవి, వైసీబీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.శ్రీదేవి, జోనల్ సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

మెళియాపుట్టి: స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పడాల చంద్రకుమారి మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

● గుర్రపుడెక్క తొలగింపు



గుర్రపుడెక్క ప్రభావంతో శివారు భూములకు సాగునీటి కష్టాలు అన్న శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి వంశధార అధికారులు స్పందించారు. మంగళవారం వంశధార కుడి ప్రధాన కాలువలో ఉన్న గుర్రపుడెక్కను తొలగించారు. కాలువ గట్లు మరమ్మతులకు అంచనాలు వేశామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని అధికారులు వెల్లడించారు.

– సరుబుజ్జిలి

● దుర్వాసనతో అవస్థలు



ఆమదాలవలస మండలంలోని గోపీనగరం పరిధి కొత్తరోడ్డు జంక్షన్ వద్ద చెత్తపోగులు వేయడంతో తీవ్ర ఇబ్బంది కలుగుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం దుర్వాసనలతో ఇక్కట్లకు గురవుతున్నామన్నారు. ఇటీవల పలువురు జ్వరాలతో బాధపడ్డారన్నారు. కొత్త రోడ్డు బ్రిడ్జి కింద వ్యాపారాలు నిర్వహిస్తున్న వారంతా ఆ చెత్తను తీసుకువచ్చి ఇళ్ల ముందు వేస్తున్నారన్నారు. అపారిశుద్ధ్యాన్ని తొలగించాలని కోరారు.

– ఆమదాలవలస

● అమ్మవారి సారె ఊరేగింపు



పాతపట్నం అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా కళింగ వైశ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సారెను సమర్పించారు. అమ్మవారి సారె మహోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించారు. రత్నాలపేట నుంచి ఆల్ ఆంధ్రరోడ్డు, ఆస్పత్రి కూడలి, కోర్టు కూడలి మీదుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

– పాతపట్నం

ప్రజా గొంతుకనవుతా..



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

- ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి
- ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: బాధ్యత గల ప్రతిపక్షంగా, ప్రజాగొంతుకగా నిలుస్తూ ప్రజల పక్షాన నిలుద్దామని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మంగళవారం మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం మాట్లాడుతూ దేశంలో ఏ ఒక్క ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేసినప్పటికీ వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోవడం బాధాకరమైన విషయమన్నారు. గత రెండు నెలలుగా కూటమి ప్రభుత్వం మేలైన పాలన అందించలేకపోవడం వల్ల ప్రజల్లో ఒక రకమైన అసహనం ప్రారంభమైందన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమల్లోనూ కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే సమయంలో బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం హయాంలో ఉన్నత స్థాయి ప్రభుత్వ సంస్థలు, ప్రాజెక్టులు వంటివి మంజూరు చేయించామన్నారు. ఇప్పటికే వాటికి సంబంధించి ఆర్థికపరమైన ఆమోదం పొందడం జరిగిందన్నారు. వీటి అభివృద్ధికి అవసరమయ్యే నిధులు తక్షణమే మంజూరు జరిగేలా స్థానిక శాసన సభ్యుడు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణం నాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిగురువలస సీఎఫ్‌ను తొలగిస్తే సహించేది లేదు



నిరసన తెలియజేస్తున్న డ్వాక్రా సంఘాల గ్రూపు లీడర్లు

- వెలుగు కార్యాలయం ఎదుట డ్వాక్రా సంఘాల లీడర్ల నిరసన

సరుబుజ్జిలి: చిగురువలస, కొండ్రగూడ, వెన్నెలవలస క్లస్టర్ పరిధికి చెందిన డ్వాక్రా సంఘం సీఎఫ్ పల్లి శ్రీదేవిని రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించేందుకు కూటమి నాయకులు రంగం సిద్ధం చేస్తున్నారు. చిగురువలస పంచాయతీకి చెందిన డ్వాక్రా సంఘాల గ్రూపు లీడర్లు మంగళవారం వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. 2010 నుంచి సీఎఫ్ శ్రీదేవిపై ఎటువంటి రిమార్కులు లేవన్నారు. గత సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అనుకూలంగా పనిచేసారని కక్షతో విధుల నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టడం తగదని వివిధ సంఘాల గ్రూపు లీడర్లు బేపల అప్పలనరసమ్మ, నేతింటి రాజు, పల్లి కృష్ణవేణి, చల్ల పార్వతి, చల్ల నాగమణి, చల్ల లక్ష్మి, బురక సత్తెమ్మతోపాటు మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. చిగురువలస క్లస్టర్ పరిధిలో 46 మంది గ్రూపు లీడర్లకు సుమారు 38 మంది వరకు సీఎఫ్ శ్రీదేవికి అనుకూలంగా ఉన్నామన్నారు. సంఘం మినిట్ బుక్‌లో గ్రూపులీ డర్లతో కాకుండా సంఘాల సభ్యులతో సంతకాలు చేయించి, నిబంధనలకు విరుద్ధంగా అధికారి పార్టీకి అనుకూలమైన మహిళకు సీఎఫ్ ఉద్యోగం కట్టబెట్టేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. అధికారుల ఏకపక్ష నిర్ణయంలో మార్పురాకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు.

ఇదే విషయమై వెలుగు ఏపీఎం కమలకుమారి పాండ్యన్ వద్ద ప్రస్తావించగా.. గ్రామాల్లో పలుమార్లు సమావేశం నిర్వహించినా సీఎఫ్ హాజరు కాలేదన్నారు. ఆమె సివిల్ సప్లయ్ డీలర్‌గా పని చేస్తున్నట్లు తమ వద్ద పూర్తి సమాచారముందన్నారు. సంఘాల్లో మెజార్టీ గ్రూపు లీడర్ల తీర్మానం మేరకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

పేదల పింఛన్లు తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారం చేపట్టిన మూడు నెలలకే పేదల పింఛన్లు తొలగించేందుకు కుట్ర పన్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు పింఛన్ డబ్బులు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత విచారణ పేరుతో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్లను తొలగించేందుకు కుట్రపన్నారని ఆరోపించారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ విచారణకు హాజరుకావాలని, సదరం ధ్రువపత్రాలను సమర్పించాలని, డాక్టర్ల పరిశీలనకు రావాలని వేలాది మంది పింఛన్ లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయటం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని ముద్ర వేసి అధికారం అడ్డంపెట్టుకుని పింఛన్లు తొలగించాలని చూస్తే న్యాయపరంగా పోరాడుతామని హెచ్చరించారు. పింఛన్ డబ్బులపైనే ఆధారపడి జీవించే అవ్వాతాతలు, దివ్యాంగులు ఎంతో మంది ఉన్నారని గుర్తుచేశారు. అలాంటి వారిని వీధిన పడేందుకు చేస్తున్న చర్యలు మానుకోవాలన్నారు. సూపర్ సిక్స్ హామీలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, రైతులకు పెట్టుబడి సాయం, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి వంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పట్టించుకోకుండా రెడ్ బుక్ పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకుల, కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సరుబుజ్జిలి: పశువులు, కోళ్ల షెడ్లుకు సంబంధించి ఆసక్తి గల పాడిరైతులు ఈ నెల 31వ తేదీ లోగా మండల పశువైద్య కార్యాలయం, ఆయా రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ సి.హెచ్.సుబ్రహ్మణ్యం మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. 20 పశువుల షెడ్డుకు సంబంధించి మొత్తం విలువ రూ.1,80,000, సబ్సిడీ రూ.91 వేలు, రైతు వాటా రూ.39వేలు చెల్లించాలన్నారు. 50 పశువులకు మొత్తం విలువ రూ.2,30,00 ఇందులో రూ.1,61,000 సబ్సిడీ, రూ. 69 వేలు రైతు వాటా చెల్లించాలని తెలిపారు. కోళ్ల షెడ్డులకు 100 కోళ్లకు మొత్తం విలువ రూ.87వేలు, సబ్సిడీ రూ.60,900, రైతు వాటా రూ.26,100 చెల్లించాలన్నారు. 200 కోళ్లకు మొత్తం విలువ రూ.432,000, సబ్సిడీ రూ.92,400, రైతు వాటా రూ.39,600 ఉంటుందని వెల్లడించారు. పాడిరైతులు తమ ఆధార్, రేషన్‌కార్డు, ఫొటో అందించాలని తెలిపారు.

ఆచార్య ముత్యం మృతి తీరనిలోటు

పొందూరు: ప్రముఖ సాహితీవేత్త, దార్శనికుడు ఆచార్య కె.ముత్యం మృతి తెలుగు సాహిత్యానికి తీరనిలోటని విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖరరావు, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు అన్నారు. ముత్యం చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, కవి గరిమెళ్ల సత్యనారాయణ, విప్లవ కవి పాణిగ్రాహి సుబ్బారావు తదితర ప్రముఖుల సాహిత్యంపై విశిష్ట పరిశోధనలు చేసిన మహానుభావుడని కీర్తించారు. మరో స్వాతంత్ర్య సమరయోధుడు పుల్లెల శ్యామసుందరరావు జీవిత చరిత్రను సమగ్రంగా చిత్రీకరించారన్నారు. శ్రీకాకుళం గిరిజనోద్యమంపై ఎన్నో రచనలు చేసి చైతన్యం కల్పించారన్నారు.

23న గ్రామ సభలు

ఆమదాలవలస: మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఆగస్టు 23న గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించి, గ్రామాలకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను, వివరాలను పంచాయతీ కార్యాలయాల ఆవరణంలో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే పనులను గుర్తించి నివేదికల సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ లక్ష్మీనరసమ్మ, ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దోమల నివారణతో ఆరోగ్యవంతమైన సమాజం



హిరమండలం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని, పరిసరాల పరిశుభ్రతగా ఉంచుకోవాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లడుతూ దోమల నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. దోమల రహిత గ్రామంగా తీర్చిదిద్దేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

నరసన్నపేట: గ్రామాలతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని మాకివలస, ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు శిరీష, అరవింద్ అన్నారు. దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పీహెచ్‌సీల ఆవరణలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దోమల నివారణతో అంటు వ్యాధులను నిర్మూలించవచ్చన్నారు.



నరసన్నపేట: మాకివలసలో ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



నరసన్నపేట: ఉర్లాంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి: మండలాభివృద్ధికి అందరూ కలిసి రావాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన పోలాకి మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ ముద్దాడ దమయంతి, జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, మండల పరిషత్ అధికారులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. తొలిసారి మండల పరిషత్‌కు విచ్చేసిన సందర్భంగా మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ భైరాగినాయుడు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం శాఖల వారీగా సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఎరువులు అందుబాటులో ఉంచాలని, పంచాయతీరాజ్ పనుల ప్రతిపాదనలు చేపట్టాలని, కొత్తరేవులో సచివాలయం అందుబాటులోకి తేవాలని, తీరప్రాంత గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడదామన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ అధికారులు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉషశ్రీ, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఏఓ చిరంజీవి, ఉపాధి ఏపీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కొవ్వొత్తులతో ర్యాలీ

ఆమదాలవలస: ఇటీవల కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమదాలవలస నియోజవర్గానికి చెందిన జనసేన నాయకులు డిమాండ్ చేశారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు, నాయకులు మంగళవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వన్ వే జంక్షన్ మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం వన్ వే జంక్షన్ వద్ద మనవహారం చేపట్టారు. జనసేన మండల అధ్యక్షుడు, మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

నరసన్నపేట: పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి పలువురికి ఉపాధి కల్పించేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని, వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంటర్‌పెన్యూర్‌షిప్ అండ్ స్మాల్ బిజినెస్ డవలప్‌మెంట్ ట్రైనర్ మోహన్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో మంగళవారం పారిశ్రామికరంగం–ప్రభుత్వ ప్రోత్సాహకాలు అనే సదస్సు విద్యార్థులకు నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న ఆయన ప్రస్తుత పరిస్థితుల్లో విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య అనుసంధానం అవగాహన ఎంతో అవసరమన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సాధ్యమని సూచించారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. తమ ప్రాంతాలకు అనువైన పరిశ్రమల ఏర్పాటుకు విద్యార్థులు ముందుకు రావాలని, అటువంటి వారికి పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలను ప్రోత్సాహిస్తున్నామని, దాంట్లో భాగంగా రైతులకు 3500 మొక్కలు మంగళవారం పంపిణీ చేసినట్లు ఏపీఓ నారాయణరావు తెలిపారు. కడియపులంక నుంచి జీడి, మామిడి, సపోట, జామ మొక్కలు తెప్పించి 72 మంది రైతులకు అందజేశామన్నారు. తర్లి ఆశ్రమ పాఠశాలకు సపోట, జామ 50 మొక్కలు చొప్పున అందజేసినట్లు తెలిపారు.

నేడు భారత్ బంద్

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఈ నెల 21 తేదీన కొత్తూరులో భారత్ బంద్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కొత్తూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు టొంపల తిరుపతిరావు, పడాల నాగభూషణ మంగళవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపడితే ఎక్కువ శాతం ఎస్సీ కులాలు నష్టపోతున్నందున భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ బంద్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పాల్గొనాలని కోరారు. బంద్ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని స్థానిక సీఐకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుడు వడమ శ్రీనివాసరావు, తదితరులు వినతిపత్రం అందజేశారు.

పొలం గట్లపై సాగుతో ప్రయోజనాలు

కొత్తూరు: పొలం గట్లపై కంది, చిక్కుడు, బంతి, మొక్కజొన్నతోపాటు రకాల పంటలు సాగు చేయడం ద్వారా రైతు పలు ప్రయోజనాలు పొందవచ్చునని ప్రకృతి వ్యవసాయం ఏటీఎం సూర్యనారాయణ, ఐటీడీఏ ఎన్ఎఫ్‌డీఏ మునలయ్య అన్నారు. కొత్తూరులో పొలం గట్లపై సాగు చేస్తున్న పలు రకాల పంటలను మంగళవారం పరిశీలించారు. ఇటువంటి పంటలు సాగు చేయడం వల్ల పంటకు తెగుళ్ల రావన్నారు. ప్రధాన పంటకు ఆశించాల్సిన పురుగులు గట్లపై సాగు చేస్తున్న పంటకు ఆశిస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు

పశువులకు గాలికుంటు టీకాలు

సరుబుజ్జిలి: పశువులకు సకాలంలో వ్యాక్సినేషన్ చేయించడం వల్ల వివిధ రకాల వ్యాధులను అరికట్టవచ్చునని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సి.హెచ్.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని పురుషోత్తపురం, పెద్దసవలాపురం గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పాతపట్నం: గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కొరసవాడ పశువైద్యశాఖాధికారి పారిశెల్లి అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని బూరగాం గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18వ తేదీ వరకు పశువులకు టీకాలు వేస్తామన్నారు. సర్పంచ్ ప్రహ్లాద పుల్లాయ్, అసిస్టెంట్ భీమారావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధిపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస పశుసంవర్ధక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని పాతినవారివీధి, బొడ్డేపల్లిపేట, డాబాలవారివీధి తదితర ప్రాంతాలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది గాలికుంటు వ్యాధి నివారణ ముందస్తు టీకాలను పశువులకు మంగళవారం వేశారు. పాడిరైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

నందికొండలో పారిశుద్ధ్య పనులు

సరుబుజ్జిలి: స్థానిక పంచాయతీ నందికొండ కాలనీలో సర్పంచ్ బొడ్డేపల్లి చాందినీ వెంకటసూర్య ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కాలువల్లో ఉన్న చెత్త, పూడికను తొలగించారు. ఈగలు, దోమలు చేరకుండా బోర్లు, నేలబావుల వద్ద క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుడుమూరు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.